## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

**తెనాలిఅర్బన్:** డయల్ యువర్ తెనాలి ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు దీనిని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ సేవలపై ఫిర్యాదులు, సూచనలు, సలహాలను సెల్ నెంబర్ 99592 25422లో తెలియజేయాలన్నారు. తెనాలి పరిధిలోని ప్రజలు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

### వ్యర్థాలు సకాలంలో తొలగించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



**తెనాలిఅర్బన్:** పట్టణంలో ఉత్పత్తి అయిన వ్యర్థాలను సకాలంలో తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, గంగానమ్మపేటలలో బుధవారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులు పరిశీలించారు. ప్రధాన రహదారులపై ఎక్కడ చెత్త లేకుండా చూడాలన్నారు. అలాగే శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అటెండెన్స్‌ను పరిశీలించారు. కార్మికులు అందరు ప్రతిరోజు విధులకు హాజరు కావాలన్నారు. చెత్త సేకరణపై అనేక ఫిర్యాదులొస్తున్నాయని, అవి రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులున్నారు.

### గంజాయి ఉందంటూ నగదు దోపిడీ

**తెనాలిరూరల్:** బ్యాగు తగిలించుకుని రోడ్డు వెంబడి నిలబడిన యువకుడి వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి అతని బ్యాగ్‌లో గంజాయి ఉందని, తనిఖీ చేయాలంటూ అతని నగదు అపహరించుకెళ్లిన ఘటన బుధవారం తెనాలిలో జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం అళ్లమూడి గ్రామానికి చెందిన నాగసురేష్ తెనాలిలో వైద్య చికిత్స కోసం వచ్చాడు. ప్రకాశం రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు వెంబడి నిలబడి ఉండగా ఇతని వద్దకు బైక్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బ్యాగులో గంజాయి ఉందని తమకు సమాచారం వచ్చిందని, తనిఖీ చేయాలని చెప్పడంతో బ్యాగు వారికి ఇచ్చాడు. బ్యాగులోని రూ. ఐదు వేలు తీసుకుని ఉడాయించారు. షాక్‌కు గురైన బాధితుడు తేరుకుని టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరం

**తెనాలి:** రాజ్యాంగ నిర్మాతను అవమానించాలని చూస్తే ప్రత్యామ్నాయ శక్తులుగా కోట్ల ప్రజల గొంతుకలు ప్రశ్నిస్తాయని 'ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్ కుమార్ అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఆయన ఖండించారు. సంస్థ తెనాలి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'అంబేడ్కర్‌ను తలచుకుంటే ఏమొస్తుంది..? అదే దేవుణ్ణి తలచుకుంటే ఏడు జన్మలవరకూ స్వర్గధామం ప్రాప్తిస్తుంది' అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అణగారిన వర్గాల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా సిద్ధించిన ఫలాలను కోట్లమంది భారతీయులు అనుభవిస్తున్నారని గుర్తుచేశారు. అటువంటి మహనీయునిపై అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం అవమానకరమన్నారు. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, పార్లమెంటు సాక్షిగా భారతీయులకు క్షమాపణ చెప్పాలని అశోక్ డిమాండ్ చేశారు.

### మైనార్టీల హక్కులను కాపాడుకోవాలి



**తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల):** మైనార్టీల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని అన్నారు. మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డుల స్వయం ప్రతిపత్తిని తన చేతుల్లోకి తీసుకోవాలనే దురుద్దేశ ధోరణితో చట్టంలో 40 సవరణలు చేసేందుకు వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిందన్నారు. వక్ఫ్‌బోర్డు అధికారాలను తగ్గించడంతో పాటు ముస్లిమేతరులను బోర్డులో చేర్చాలనే ప్రతిపాదన సరికాదన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఈ వక్ఫ్ సవరణ బిల్లు దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రద్దు చేసినమైనార్టీల స్కాలర్‌షిప్‌ను కేంద్రం తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో హక్కులపై ప్రతి ఒక్కరు స్పందించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

## మల్లెపాడులో
# నిలిచిపోయిన నిర్మాణాలు

### పూర్తికాని ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్

- గత ప్రభుత్వంలో బేస్‌మెంట్ వరకు పూర్తయిన నిర్మాణం
- బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులను నిలిపివేసిన కాంట్రాక్టరు
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా నిర్మాణాన్ని కొనసాగించని కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారులు



పల్లెపండుగ నిధులతో నిర్మించిన రోడ్డు

**తెనాలిరూరల్:** తెనాలి మండలం మల్లెపాడు గ్రామంలో ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా కనీసం వాటి నిర్మాణం గురించి పట్టించుకున్న నాథుడే లేడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామంలో గ్రామ సచివాలయంతో పాటు ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో సచివాలయ నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు. మిగిలిన రెండు భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి.

గ్రామంలో రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ. 21.80 లక్షలు, వెల్‌నెస్ సెంటర్ కోసం రూ. 17.50 లక్షలు కేటాయించారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేశారు. బిల్లులు కొంత పెండింగ్‌లో ఉండడంతో అంగలకుదురుకు చెందిన కాంట్రాక్టరు పనులను మధ్యలోనే ఆపేశారు. నిధులు మంజూరై ఉన్నా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్మాణాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఆరు నెలల్లో గ్రామంలో కేవలం పల్లె పండుగ కార్యక్రమం కింద వచ్చిన రూ. ఐదు లక్షలతో 80 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు మినహా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

**గత ప్రభుత్వంలో జోడు గుర్రాలుగా అభివృద్ధి–సంక్షేమం**

తెనాలి మండలం మల్లెపాడు తెనాలి పట్టణానికన్నా ముందే నాగరికత విలసిల్లిన గ్రామం. గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ



కేవలం బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయిన ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలు

దూరంలోనే ఉంది. పట్టణాన్ని ఆనుకునే ఉన్నా.. పాలకులు గ్రామాభివృద్ధిని లక్ష్యపెట్టకపోవడంతో 2019 ముందు వరకు గ్రామంలో అభివృద్ధి నామమాత్రంగానే ఉంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టింది. గ్రామస్తుల దశాబ్దాల కల అయిన అంతర్గత, ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణమూ జరిగాయి. రోడ్లతో పాటు డ్రెయిన్ల నిర్మాణమూ జరిగింది.

ఒక్క మల్లెపాడు గ్రామంలోనే 2019 జనవరి వరకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.11,85,57,324 ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. అభివృద్ధి పనులకు మరో రూ. 10,30,93,921 కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. అమ్మ ఒడి పథకం కింది 284 కుటుంబాలకు రూ. 1,23,90,869 ప్రభుత్వం అందించారు. విద్యా దీవెన కింది 230 కుటుంబాలకు రూ. 95,95,309 చెల్లించారు. వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనం, సచివాలయ భవన నిర్మాణం చేపట్టారు. 'నాడు–నేడు' పథకం కింద గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ. 17.95 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఇక గ్రామంలో ప్రధాన రోడ్డుతో పాటు అంతర్గత రోడ్లకు రూ. 58.50 లక్షలు కేటాయించి నిర్మాణం పూర్తి చేశారు.

### అభివృద్ధి అటకెక్కింది!

అదే విధంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవగా వచ్చిన నిధులలో డ్రెయిన్లను రూ. 15 లక్షలు కేటాయించి నిర్మాణం పూర్తి చేశారు. రూ. మూడు లక్షలతో అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరగడం లేదు. కేవలం 80 మీటర్ల సీసీ రోడ్డు వేశారని, అది కూడా నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టు లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. గ్రామ ప్రధాన మార్గంలో రోడ్డులకు మధ్య మెరక తోలాల్సి ఉంది. కనీసం ఆ పనులనూ చేపట్టడం లేదు. డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. గ్రామంలో ఇంకా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### సంతోషాల పండుగ క్రిస్మస్



కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి మనోహర్, పక్కన బిషప్ సుధీర్‌కుమార్

**తెనాలిరూరల్:** క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ సంతోషంతో జరుపుకునే పండుగ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణానికి చెందిన ఈరే మినిస్ట్రీస్, ది తెనాలి యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు స్థానిక ఐతానగర్‌లోని స్టేట్ బ్యాంక్ సమీపంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ కె. సుధీర్‌కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మనోహర్ మాట్లాడుతూ లోక రక్షణ కోసం ప్రభువైన ఏసుక్రీస్తు జన్మించిన సందర్భంగా జరుపుకునే ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఆయన బోధనలను అనుసరించాలన్నారు. క్రీస్తు పుట్టుక లోకానికి పండుగ అని, ప్రతి ఒక్కరు పండుగ సంతోషంలో భాగస్వాములు కావాలని కోరారు.

యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్, ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఈడీ ఎ. కోటేశ్వరరావు, ఆర్టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ టి.శోభమంజరి, రెవ.ఎ. భానుప్రసాద్, రెవ కూచిపూడి అబ్రహాం, బిషప్ జె. ప్రభుదాస్, బ్రదర్ పి. ఐజక్, రెవ డి. మార్టిన్‌లూథర్ బాబు, ఇతర అసోసియేషన్ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

## మురుగు కాల్వను ప్రతిరోజు బాగు చేయండి

### మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

**తెనాలిఅర్బన్:** పట్టణంలోని మురుగు కాల్వలో వ్యర్థాలు పెరుకుపోయి పారుదలకు అవరోధంగా మారుతున్నాయని, వాటిని ప్రతిరోజ తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 11,16,37 వార్డులలో బుధవారం ఆయన ఉదయం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. కాల్వల్లో వచ్చిన వ్యర్థాలను వెంటనే బయటకు పంపే విధంగా చూడాలన్నారు. అలాగే ప్రతిరోజు సేకరించే చెత్త వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటి



రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మీపతి

రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పలువురు శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## అంబేడ్కర్ భారీ విగ్రహాల ప్రదర్శనకు రికార్డు ఖాయం

### ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాంక్ష

**తెనాలి:** గుంటూరు జిల్లా తెనాలికి చెందిన శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు వినూత్నంగా ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధిస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యక్తంచేశారు. తెనాలి ఆటోనగర్ సమీపంలో కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను బుధవారం మంత్రి మనోహర్ ప్రారంభించారు. అక్కడ కొలువుదీర్చిన అడుగు ఎత్తు నుంచి 30 అడుగుల ఎత్తువరకు గల ఫైబర్, కాంస్య విగ్రహాలను తిలకించారు. బస్ట్ సైజ్ విగ్రహాల్నుంచి కుర్చీలో కూర్చున్న భంగిమలో, నిలుచుని ఉన్న అంబేడ్కర్ విగ్రహాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. భారీ అంబేడ్కర్ విగ్రహాల ప్రదర్శనను తమ రికార్డుల్లో నమోదు చేయాల్సిందిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, అమెరికన్ బుక్ ఆఫ్ రికార్డ్,



ప్రదర్శనను ప్రారంభించి విగ్రహాలను తిలకిస్తున్న మంత్రి మనోహర్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డు వారికి వీడియో/ఫొటోలు పంపినట్టు శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు మంత్రికి వివరించారు. గిన్నిస్ బుక్ రికార్డ్స్ వారు పరిశీలిస్తున్నామని చెప్పగా, మిగిలినవారు తమ ఆమోదం తెలియజేసినట్టు వివరించారు. సూర్యశిల్పశాల నిర్వాహకులు తమ శిల్పకళా నైపుణ్యంతో తెనాలి ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారని అభినందిస్తూ, తెనాలి ప్రాంత ప్రజలందరూ కచ్చితంగా ఈ ప్రదర్శనను తిలకించాలని మంత్రి సూచించారు.

## ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

### జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బీవీ సతీష్ కుమార్

**మోతడక(తాడికొండ):** ఫార్మసీ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బీవీ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ కోర్సు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యం, ఫిట్‌నెస్, మైండ్ మ్యాపింగ్, కెరీర్, ఆధ్యాత్మికత, సర్కిల్, స్పేస్, మైహోమ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు తరచూ తమ పిల్లలను పర్యవేక్షించాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని, టెక్నాలజీతో పోటీపడుతూ సెల్‌ఫోన్, కంప్యూటర్లను అవసరం మేరకే




మాట్లాడుతున్న డాక్టర్ బీవీ సతీష్ కుమార్

వినియోగించుకోవాలని సూచించారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని స్మార్ట్ క్లాస్‌రూమ్‌లో స్మార్ట్ యాక్టివిటీలు అధునాతన పద్ధతుల ద్వారా బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.వెంకట రామారావు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'డీప్ ఫేక్ టూల్స్'తో సవాళ్లను అధిగమించొచ్చు

### వీఐటీ– ఏపీలో డీప్ ఫేక్ టూల్స్ టెక్నిక్, ఎథికల్ ఇంప్లికేషన్స్‌పై శిక్షణ కార్యక్రమం

**తాడికొండ:** డీప్ ఫేక్ టూల్స్ టెక్నాలజీతో సవాళ్లను సులభంగా అధిగమించవచ్చని ప్రొఫెసర్ డాక్టర్ సచినందన్ మొహంతి అన్నారు. బుధవారం వీఐటీ–ఏపీ విశ్వ విద్యాలయంలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఐఈఈఈ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ సంయుక్తంగా డీప్ ఫేక్ టూల్స్, టెక్నిక్స్, ఎథికల్ ఇంప్లికేషన్స్ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌కు అయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు డీప్ ఫేక్ టెక్నాలజీలో అభివృద్ధి చెందుతున్న సవాళ్ళు,



అవకాశాలపై వివరించారు.

ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి 70 మంది ఔత్సాహికులు పాల్గొనగా స్కోప్ డీన్ డాక్టర్ సుధాకర్ ఇలాంగో, ఏఐ మరియు ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ రీజా పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధే లక్ష్యం

**చేబ్రోలు:** సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం కృషి చేయాలని చేబ్రోలు ఎంపీడీఓ కే.లలిత అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు, సచివాలయం సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు రెండో బ్యాచ్‌కు శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ లలిత మాట్లాడుతూ సుస్థిరాభివద్ధి కోసం 9 అంశాలతో గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన 2030 నాటికి సుస్థిరాభివృద్ధి స్థానికరణ దిశగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని సూచించారు.

### నేడు కొల్లిపరలో వర్ధంతి సభ

**తెనాలి:** దళిత ఉద్యమనేత, ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసురత్నం ప్రథమ వర్ధంతి సభను గురువారం ఆయన స్వస్థలమైన కొల్లిపరలో నిర్వహించనున్నారు. కె.బెన్‌హర్‌బాబు సమన్వయకర్తగా ఉదయం 10.30 గంటలకు ఏర్పాటయే సభలో కనపర్తి ఏసురత్నం స్మారకోపన్యాసాలను సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్ ప్రొఫెసర్ కైవే రత్నం, ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి చేస్తారు. డాక్టర్ స్వర్ణలతాదేవి, డాక్టర్ ఫ్రాంక్ విశ్వనాథ్, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి గుజ్జర్లమూడి కృపాచారి, న్యాయవాది పిల్లి విద్యాసాగర్, 'బాస' పత్రిక ఎడిటర్ ఎస్.విద్యాసాగర్, 'భారత్ బచావో' వేము సమత, దళిత నాయకులు మల్లెల వెంకట్రావు, ఏఎన్‌యూ అంబేడ్కర్ చైర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పిల్లి వాసు, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక కన్వీనర్ అక్కిదాసు కిరణ్‌కుమార్ సహా పలువురు ప్రముఖులు ఏసురత్నంతో తమ జ్ఞాపకాలను, అనుబంధాన్ని స్మరించుకుంటారు. ఇదే వేదికపై డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి (కార్ట్స్) రచించిన 'దళిత ఘోష' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.

### గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

ఎంపీడీవో విజయలక్ష్మి

**కొల్లిపర:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా ఉండి నిత్యం కృషి చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి సూచించారు. బుధవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు– స్థానికీరణ అనే అంశాలపై గత వారం రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామాలే సుస్థిరభివృద్ధికి సోపానాలు అని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధికి తోడ్పడే 17 అంశాలపై వివరించారు. రానున్న రోజులల్లో ప్రణాళికా బద్ధమైన అంచనాల తయారీలో సిబ్బంది ఎలా వ్యవహరించాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ, పీఆర్ఏఈ అవుతు సాంబిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధాకర్, అంగన్ వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, అన్ని గ్రామాల సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### 22 నుంచి యోగ శిబిరం

**తెనాలిఅర్బన్:** శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఉచిత యోగ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగ గురువు తాడికొండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బోసురోడ్డులోని శ్రీకన్యక పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు జరిగే యోగ శిబిరాన్ని మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ప్రారంభిస్తారని చెప్పారు. 21 రోజుల పాటు దీనిని నిర్వహించనున్నట్లు వివరించారు.

## చిర్రావూరులో అధ్వాన పారిశుద్ధ్యం



**తాడేపల్లిరూరల్:** మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తాడేపల్లి రూరల్ చిర్రావూరు గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. చిర్రావూరు మొత్తం 4వేలకు పైగా జనాభా ఉండగా మొత్తం కలిపి 15 రహదారులు కూడా ఉండవు. ఆ రహదారుల్లో డ్రైనేజీ తీసేవారు లేక డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం వల్ల దోమల వృద్ధి చెందుతున్నాయని, ఎంతో మంది అనారోగ్యాల పాలవుతున్నారని వెంటనే సంబంధిత అధికారులు చిర్రావూరులో డ్రైనేజీల పూడిక తీయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## హాస్టల్ విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీ

**తెనాలిరూరల్:** మండలంలోని కొలకలూరు గారమంలో గల సంఘిక సంక్షేమ హాస్టల్ (1)ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థుల వసతులను పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. విజిటర్స్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతకం చేశారు. చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల తహసీల్దార్ దృష్టికి వచ్చింది. దీంతో తనమిత్ర బృందమై ఎన్జీవో సంఘ నాయకులు బి. కృష్ణమోహన్, కూనపెరెడ్డి శ్రీనివాసరావు తదితరులతో కలసి ఇదే విషయాన్ని పట్టణానికి చెందిన కాంట్రాక్టరు సూర్యదేవర భువన్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు. హాస్టల్ తనిఖీకి వెళ్లిన సందర్భంగా విద్యార్థులకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లు, దిండ్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేసి, హాస్టలుకు ఫ్యాన్లు, లైట్లను సమకూర్చారు. వీటిని తనిఖీ సందర్భంగా వీరు అందజే



విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, భువన్

శారు. రానున్న రోజుల్లో అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తామని, అక్కడ ఉండే పేద విద్యార్థులకు తమమిత్ర బృందం, దాతల సాయంతో కనీస అవసరాలను కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా దాత భువన్‌ను సత్కరించి అభినందించారు.

## అబాకస్ చాంపియన్‌గా అత్తోట హార్దీ

**తెనాలి:** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగిన యూసీ మాస్ అబాకస్ పోటీల్లో తెనాలికి చెందిన అత్తోట హార్దీ రెండు స్థాయిల్లోనూ ఛాంపియన్‌గా నిలిచాడు. ఢిల్లీలోని ఢిల్లీ యూనివర్శిటీలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో ఆరువేల మంది పాల్గొన్నారు. విదేశీ కేటగిరీలో 30 దేశాలు పాల్గొన్నాయని, ఈ పోటీల్లో పాల్గొన్న హార్దీ లెవెల్–ఏ2లో రెండింటిలోనూ ఛాంపియన్‌గా సత్తా చాటినట్టు హార్దీ తండ్రి ప్రమోద్ బుధవారం సాయంత్రం ఇక్కడ తెలియజేశారు. స్థానిక అయితానగర్‌కు చెందిన హార్దీ, కొల్లూరులోని ఫోర్‌ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. అద్భుతమైన వేగం, ఖచ్చితత్వంతో సంక్లిష్టమైన అబాకస్ సమస్యలను పరిష్కరించి, తన నైపుణ్యాన్ని చాటినట్టు



బహుమతులతో అత్తోట హార్దీ

తెలిపారు. 15వ తేదీ సాయంత్రం కేంద్ర మంత్రి మీనాక్షి లేకి చేతులమీదుగా బహుమతులను అందుకున్నట్టు వివరించారు. మంగళవారం రాత్రి తెనాలి చేరుకున్న అబాకస్ బాలమేధావి హార్దీకి, రైల్వేస్టేషనులో కుటుంబసభ్యులు, బంధువులు ఘనంగా స్వాగతం పలికారు.

## ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వీడాలి

**పొన్నూరు:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మొక్కుబడిగా నిర్వహించవద్దని, రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారాన్ని అధికారులు చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మన్నవలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై ప్రజల సందేహాలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్న రెవెన్యూ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత కార్యాలయంలోని రెవెన్యూ భూ రికార్డులను సరిచూసుకుంటే సదస్సులో అర్జీలకు సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇలా పనిచేస్తే సదస్సుల లక్ష్యం నెరవేరదని, పనితీరు మార్చుకోవాలని అధికారులను మందలించారు. రీసర్వే, అడంగల్‌లో మార్పులు, చేర్పులు, సర్వే నంబర్లు సరిచేయడం, ఆర్ఎస్ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు అనంతరం పేర్ల మార్పిడి,



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాల వంటి 56 సర్వీసులను తెలుసుకునేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న సదస్సులో గ్రామానికి సంబంధించిన భూ రికార్డులన్నీ అందుబాటులో ఉండాలని, ప్రజలకు జవాబుదారీగా అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. పలువురు అర్జీదారులు అధికారుల పనితీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మ్యుటేషన్లు 24, పాస్‌బుక్ రీప్లేస్ 7, ఎఫ్ లైన్ 50, అడంగల్ కరెక్షన్ 5, ఎఫ్ఎంసీ 1, డిజిటల్ సిగ్నేచర్ 1 వచ్చినట్లు తెలిపారు.